సంపుటి :03 | సంచిక :29 | పేజీలు :06 | www.aksharadarbar.com

అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

సోమవారం 02, మార్చి 2026

# హోలీ వేడుకలపై అయోమయం

- చంద్రగ్రహణం రోజు పండుగ
- 4వ తేదీ పండుగ జరుపుకోవాలని పండితుల సూచన
- కానీ, ప్రభుత్వ సెలవు మాత్రం 3వ తారీఖే..
- ఎవరిష్టం వారిదన్న ధోరణిలో వేడుకలు జరుపుకొనే అవకాశం

03



# హోలీ శుభాకాంక్షలు

వసంతం రాకతో ప్రకృతి పులకించి కొత్త చిగుళ్లను తొడిగే వేళ, నలుదిక్కులా రంగులు విరజిమ్ముతూ మనసుల్లో ఆనందాలు నింపే అద్భుత వేడుకే హోలీ పండుగ. చలికాలానికి వీడ్కోలు పలికి నునువెచ్చని ఎండలు పలకరించే ఈ శుభసమయంలో, చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ రంగుల కేళిలో మునిగితేలాలని అక్షరదర్బార్ ఆకాంక్షిస్తున్నది. ప్రకృతిలోని రంగులన్నీ ఏకమై ఇంద్రధనస్సులా నేల మీద పరుచుకున్నట్లుగా, అందరి మధ్య మమతానురాగాలు వెల్లివిరిసి ప్రతి ఇంటా సంతోషాలు వెల్లివెరియాలని అభిలషిస్తున్నది. ఈ సందర్భంగా పాఠకులకు, ప్రకటనకర్తలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నది.

- అక్షరదర్బార్ టీం

## ఒక్కరోజే 6,273 మెగావాట్ల

# విద్యుత్ డిమాండ్

- టీజీఎస్పీడీసీఎల్ చరిత్రలో సరికొత్త మైలురాయి
- డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా
- అవసరానికి అనుగుణంగా సాంకేతికత
- సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

02






- ప్రజలకు, పార్టీ మధ్య వారధిలా ఉండాలి
- పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలి
- ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ
- ఉభయ తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షులకు దిశానిర్దేశం
- సమావేశానికి మంత్రులకు నో ఎంట్రీ.. ఇబ్బంది పడిన పలువురు మంత్రులు
- అధిష్ఠానం, పీసీసీ నుంచి స్పష్టమైన ఆదేశాలు

05

# ప్రజల మధ్యకు వెళ్లండి

## పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయండి





# ప్రగతి పథం..



ఉమ్మడి వరంగల్‌లో 'ప్రజాపాలన ప్రణాళిక'కు సర్వం సిద్ధం

# 99 రోజుల లక్ష్యం!


02



తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'ప్రజాపాలన ప్రణాళిక'ను క్షేత్రస్థాయిలో విజయవంతం చేసేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులు కంకణం కట్టుకున్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ స్ఫూర్తితో ఈ నెల 6వ తేదీ నుంచి జూన్ 12 వరకు కొనసాగే 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను ఒక యజ్ఞంలా నిర్వహించేందుకు ఎమ్మెల్యేలు సిద్ధమయ్యారు. ఇప్పటికే రెండేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకున్న తరుణంలో, మిగిలిన సమయాన్ని ప్రజా సమస్యల పరిష్కారానికి, నియోజకవర్గాల సమగ్ర అభివృద్ధికి వారధిగా మార్చుకోవాలని నిర్ణయించారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖలతో పాటు ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలందరూ తమదైన ముద్ర వేసేందుకు కార్యాచరణను సిద్ధం చేసుకున్నారు.

– వరంగల్, అక్షర దర్బార్

- ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు ప్రత్యేక డ్రైవ్
- క్షేత్రస్థాయిలో పట్టు కోసం ఎమ్మెల్యేల వ్యూహరచన
- సొంత 'టీం'లతో రంగంలోకి ప్రజాప్రతినిధులు
- రెవెన్యూ, పంచాయతీరాజ్, వైద్యశాఖలపై ప్రత్యేక ఫోకస్




## ప్రగతి ప్రణాళిక'

# అమలు చేయాలిక!

- 6వ తేదీ నుంచి 99 రోజుల డ్రైవ్
- విజయవంతం చేసేందుకు ఎమ్మెల్యేలు సంసిద్ధం
- ఇప్పటికే.. ఎవరికి వారికి సొంత టీంలు
- నిబద్ధత గల అధికారులకు ప్రాధాన్యం
- అవసరమైతే తమ ప్రాభవాన్ని వినియోగించి బదిలీలు
- రెవెన్యూ, పంచాయతీరాజ్, వైద్యారోగ్యశాఖలపై దృష్టి

**అక్షరదర్బార్, వరంగల్**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'ప్రజాపాలన ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణను విజయవంతం చేసేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఇప్పటికే సిద్ధమయ్యారు. 99 రోజుల డ్రైవ్ ఈనెల 6 నుంచి జూన్ 12 వరకు, అంటే రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల వరకు కొనసాగుతుంది. కార్యక్రమాల్లో భాగంగా ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల అభివృద్ధే లక్ష్యంగా వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ ఈస్ట్ ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్, ములుగు ఎమ్మెల్యే, మంత్రి సీతక్క, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అడుగులు వేస్తున్నారు. తద్వారా తమ నియోజకవర్గాలపై మరింత పట్టు సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నారు. పదవీకాలం రెండు ఏళ్లు పూర్తి చేసుకున్న తరుణంలో, మిగిలిన రెండున్నర ఏళ్ల సమయాన్ని ప్రజలకు మరింత చేరువయ్యేందుకు, పెండింగ్ అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు, కొత్తగా మరికొన్ని పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**- ఏయే పనులంటే..**


**99 రోజుల డ్రైవ్ ను నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు పర్యవేక్షించనున్నారు. డ్రైవ్ ద్వారా ప్రజలకు ఇంటి నిర్మాణానికి సులభంగా అనుమతులు అందుతాయి. నల్లా కనెక్షన్లు, కరెంటు మీటర్ల సత్వరం అందేలా చర్యలు తీసుకుంటారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పేరుకున్న ఫైళ్ల పరిష్కారం కోసం యంత్రాంగం పనిచేస్తుంది. ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుధ్యం పనులు జరుగుతాయి. పలుచోట్ల పబ్లిక్ స్కూళ్లను ప్రారంభించి, ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా వాటిని తీర్చిదిద్దుతారు. మహాలక్ష్మి, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన ప్రతిఒక్కరికీ అందేలా సాంకేతికత వినియోగిస్తారు. జూన్ 2వ తేదీన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ప్రారంభిస్తున్న ఈ డ్రైవ్ అదే నెల 12తో ముగుస్తుంది.**

**- ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు వంద రోజుల ఎజెండాను అమలు చేయడంలో భాగంగా ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లోని మండల, గ్రామ స్థాయి పర్యటనలను ముమ్మరం చేశారు. కేవలం అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకే పరిమితం కాకుండా, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయా లేదా అన్న అంశంపై వ్యక్తిగత శ్రద్ధ వహిస్తున్నారు. ఈ 99 రోజుల ప్రణాళికలో భాగంగా దస్త్రాల పరిష్కారం కోసం ప్రత్యేక డ్రైవ్ లు నిర్వహిస్తూ, పాలనలో వేగం పెంచేందుకు కృషి చేస్తున్నారు. రాబోయే వరంగల్ కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నగర పరిధిలోని నాలుగు నియోజకవర్గాల్లో భారీ ఎత్తున నిధులు కేటాయించి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నారు. నియోజకవర్గాల్లో తమదైన ముద్ర వేయాలనే తపనతో ఎమ్మెల్యేలందరూ క్షేత్రస్థాయిలో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తున్నారు.

**- ఎవరికి వారికి సొంత టీంలు**

ప్రజాప్రతినిధులు తాము లక్ష్యాలను చేరుకునేందుకు నిబద్ధత కలిగిన అధికారుల అవసరం ఉందని గుర్తించి, తమ నియోజకవర్గాల్లో సొంత టీంలను ఏర్పాటు చేసుకునే పనిలో పడ్డారు. పనిచేయని లేదా మందకొడిగా వ్యవహరించే అధికారుల స్థానంలో చురుకైన వారిని తెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా రెవెన్యూ, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్, పోలీస్, వైద్యారోగ్యశాఖల వంటి కీలక విభాగాల్లో తమకు అనుకూలంగా ఉండి, ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించే అధికారులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. గతంలో అదే నియోజకవర్గంలో పనిచేసి మంచి పేరు తెచ్చుకున్న అధికారులను గుర్తించి, వారిని బదిలీలపై తిరిగి రప్పించుకుంటున్నారు. అధికార పార్టీ ప్రతినిధులు కావడంతో ఉన్నతాధికారుల నుంచి కూడా వీరికి పూర్తి సహకారం అందుతోంది. ఈ విధంగా తమకు నమ్మకమైన, సమర్థవంతమైన అధికారుల బృందంతో కలిసి వచ్చే రెండున్నర ఏళ్లలో నియోజకవర్గ రూపురేఖలను మార్చివేయడమే కాకుండా, రాబోయే ఎన్నికల నాటికి తిరుగులేని పట్టు సాధించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు వ్యూహరచన చేస్తున్నారు.



## ఒక్కరోజే 6,273 మెగావాట్ల

# విద్యుత్ డిమాండ్

- టీజీఎన్పీడీసీఎల్ చరిత్రలో సరికొత్త మైలురాయి
- డిమాండ్ కు అనుగుణంగా విద్యుత్ సరఫరా
- అవసరానికి అనుగుణంగా సాంకేతికత
- సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

అక్షరదర్బార్, హనుమకొండ : తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీఎన్పీడీసీఎల్) చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా విద్యుత్ వినియోగం సరికొత్త గరిష్ఠ స్థాయిని తాకింది. సోమవారం సంస్థ పరిధిలో ఏకంగా 6,273 మెగావాట్ల అత్యధిక విద్యుత్ డిమాండ్ నమోదైందని, ఇది సంస్థ ప్రయాణంలోనే ఒక కీలకమైన రోజని సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అధికారికంగా వెల్లడించారు. కేవలం ఒక్క రోజు వ్యవధిలోనే పాత రికార్డులు తుడిచిపెట్టుకుపోవడం గమనార్హం. ఆదివారం నమోదైన 6,267 మెగావాట్ల రికార్డును అధిగమిస్తూ, సోమవారం నాటికి ఈ డిమాండ్ 6273 మెగావాట్లకు చేరుకుంది. రాష్ట్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావం ప్రత్యక్షంగా విద్యుత్ వినియోగంపై పడుతోందని, వేసవి తాపం కారణంగా గృహ, వాణిజ్య అవసరాలకు విద్యుత్ వినియోగం భారీగా పెరగడమే ఈ రికార్డు స్థాయి డిమాండ్‌కు ప్రధాన కారణమని అధికారులు విశ్లేషిస్తున్నారు. రికార్డు స్థాయిలో డిమాండ్ పెరిగినప్పటికీ, వినియోగదారులకు ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరాను అందించడంలో సంస్థ విజయం సాధించింది. రాబోయే వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున, విద్యుత్ డిమాండ్ ఇంకా పెరగవచ్చని సీఎండీ అంచనా వేశారు. అదనపు లోడ్‌ను తట్టుకునేలా ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్ల వద్ద తగిన చర్యలు తీసుకున్నట్లు సంస్థ స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ నిరంతర పర్యవేక్షణ, దిశానిర్దేశంతో ముందుకు వెళ్తున్నామని సీఎండీ వెల్లడించారు.



# మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి

అక్షరదర్బార్, హనుమకొండ: హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ స్పీకర్ శ్రీపాదరావు చిత్రపటానికి హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, అదనపు కలెక్టర్ ఎన్ రవి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ సత్యపాల్ రెడ్డి, ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, జడ్పి సీఈవో శేషాద్రి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ ఉన్నారు.

# ఆఫీసుల్లో కలెక్టర్ తనిఖీలు

**- అధికారులు, సిబ్బంది హాజరు, విధుల నిర్వహణపై ఆరా**

అక్షరదర్బార్, హనుమకొండ: హనుమకొండ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయ భవనం (ఐడీఓసీ– కలెక్టరేట్)లోని పలు ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రౌండ్ ఫ్లోర్ లోని కలెక్టరేట్ కార్యాలయ వివిధ విభాగాలు, మొదటి అంతస్తులోని ముఖ్య ప్రణాళిక శాఖ, భూసర్వే, కొలతల శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ, ఖజానా శాఖ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, జిల్లా పరిశ్రమల కేంద్రం, పౌర సరఫరాల శాఖ, ఈ–డిస్ట్రిక్ట్ విభాగం, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ, పరిపాలన విభాగ తదితర కార్యాలయాలను సందర్శించి అక్కడి అధికారులు, సిబ్బంది హాజరు, విధుల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. కార్యాలయాలలో ప్రజలకు



అందిస్తున్న సేవలు, పెండింగ్ ఫైళ్లు, సేవల అమలులో పారదర్శకత, సమయపాలన వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. కార్యాలయాల్లో శుభ్రత, రికార్డుల నిర్వహణ, హాజరు నమోదు పట్ల క్రమశిక్షణ పాటించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎన్ రవి, పరిపాలన అధికారి గౌరీ శంకర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సంప్రదాయ పద్ధతుల్లో హోలీ జరుపుకుందాం

**వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్**



అక్షరదర్బార్, హనుమకొండ: సంప్రదాయ పద్ధతుల్లో హోలీ పండుగను జరుపుకుందామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ప్రజలకు పిలుపునిచ్చారు. హోలీ పండుగను పురస్కరించుకుని ఆయన ప్రజలకు పలు సూచనలు చేశారు. పండగ రోజు ఎవరు కూడా మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, హోలీ అనంతరం యువత స్నానాల కోసం శివారు ప్రాంతాల్లోని చెరువులు, లోతట్టు ప్రాంతాలకు వెళ్ళవద్దని, ఒకవేళ వెళ్ళాల్సి వస్తే తగు జాగ్రత్తలను పాటించాలని సూచించారు. ప్రధానంగా బహిరంగ ప్రదేశాలపై, అనుమతి లేకుండా వ్యక్తులపై, మహిళలు, యువతులు,వాహనాలపై రంగులు చల్లడం బైకులపై, కార్లల్లో గుంపులుగా తిరిగి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు.

# విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలి

## విద్యా కమిషన్ సిఫారసులపై పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళన

అక్షర దర్బార్, పరకాల: రాష్ట్ర విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని కేటాయించాలని, పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను దెబ్బతీసే విద్యా కమిషన్ సిఫారసులను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని తెలంగాణ పాలిటెక్నిక్ విద్యార్థుల జేఏసీ రాష్ట్ర ఛైర్మన్ మేకల అక్షయ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం పరకాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద విద్యార్థులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి నేతృత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమర్పించిన నివేదిక పాలిటెక్నిక్ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా ఉందన్నారు. ప్రస్తుత, పూర్వ విద్యార్థులు, ఉద్యోగ సంఘాలు, విద్యార్థి సంఘాలతో చర్చలు లేకుండానే రూపొందించిన నివేదికలో ఈసెట్ ద్వారా బి.టెక్ లేటరల్ ఎంట్రీ విధానాన్ని రద్దు చేసి మొదటి సంవత్సరం నుంచే చదవాలన్న సిఫారసు చేయడం అన్యాయమన్నారు.
నాణ్యమైన సాంకేతిక విద్య అందిస్తున్న రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణ మండలి (ఎస్‌బీటీఈటీ) బోర్డును రద్దు చేయాలన్న ప్రతిపాదన హాస్యాస్పదమని విమర్శించారు. పాలిటెక్నిక్ వ్యవస్థపై ప్రశ్నించిన బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీష్ రావుపై కమిషన్ ఛైర్మన్ రాజకీయ వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని, వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో జేఏసీ నాయకులు దొడ్డిపల్లి కుమార్, విద్యార్థి నాయకులు పల్లేరు స్వయంవీర, అనిల్, భవాని, భాను ప్రకాష్, అక్షయ, మోహియుద్దీన్, విశ్రుత్, సాన్వి తదితరులు పాల్గొన్నారు.





## సంపత్ రావుకు గౌరవ డాక్టరేట్ ప్రదానం

అక్షర దర్బార్, మల్హర్ : మలహర్ మండల్ తాడిచర్ల గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త వీరమనేని సంపత్ రావు సమాజానికి చేసిన విశిష్ట సేవలను గుర్తిస్తూ తమిళ్ కల్చరల్ యూనివర్సిటీ ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆదివారం చెన్నైలో నిర్వహించిన వేడుకలో మాజీ సివిల్ జడ్జి వెంకటేషన్, సినీ నటి నిరోష, అండర్ సెక్రెటరీ డాక్టర్ డి.ఆనంద రాజ్, కౌన్సిలర్ కె.నాగరాజు, వైస్ కౌన్సిలర్ జె.మాణిక్ ఆనందరాజ చేతుల మీదుగా పట్టాను అందజేశారు. ఈ సందర్భంగా సంపత్ రావు మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి ఈ గౌరవాన్ని అందించిన పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ డాక్టరేట్ తనపై సామాజిక బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలతో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని అన్నారు.



## వైభవంగా దేవుని గుట్ట జాతర

అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి: ములుగు మండలం కొత్తూరు గ్రామంలోని దేవుని గుట్ట వద్ద లక్ష్మీ నరసింహ స్వామి జాతరలో భాగంగా సోమవారం ఆలయంలో హోమం ,పూర్ణాహుతి మొక్కులు సమర్పించినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ కిషన్ తెలిపారు. ఈ సందర్భంగా గుట్ట కింద మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కొత్తూరు గ్రామ పెద్దలు, ఆలయ పాలకమండలి పాల్గొన్నారు.

# హోలీ వేడుకలపై అయోమయం

- చంద్రగ్రహణం రోజు పండుగ
- 4వ తేదీ పండుగ జరుపుకోవాలని పండితుల సూచన
- కానీ, ప్రభుత్వ సెలవు మాత్రం 3వ తారిఖే..
- ఎవరిష్టం వారిదన్న ధోరణిలో వేడుకలు జరుపుకొనే అవకాశం

అక్షరదర్బార్, హైదరాబాద్ :
తెలుగు క్యాలెండర్ ప్రకారం ప్రతి ఏటా ఫాల్గుణ పూర్ణిమ నాడు హోలీ పండుగ జరుపుకొంటాం. అయితే.. ఈసారి ఆరోజు చంద్రగ్రహణం ప్రభావం పడింది. దీంతో ప్రజల్లో అయోమయం నెలకొంది. గ్రహణం కారణంగా ఏర్పడే సూతక కాలం దృష్ట్యా, పండుగ జరుపుకునే తేదీల విషయంలో పండితులు స్పష్టమైన సూచనలిస్తున్నారు. ద్రిక్ పంచాంగం ప్రకారం, కాముడి దహనం సోమవారం సాయంత్రం 6.22 గంటల నుంచి రాత్రి 8.50 గంటల మధ్య నిర్వహించుకోవాలని సూచిస్తున్నారు. సోమవారం సాయంత్రం 5.55 గంటలకే పౌర్ణమి తిథి ప్రారంభం కానుండటంతో గ్రహణ ప్రభావం తక్కువగా ఉండే ఆ రోజే దహన కార్యక్రమం పూర్తి చేయడం శాస్త్ర సమ్మతమని స్పష్టం చేస్తున్నారు. పౌర్ణమి తిథి మార్చి 3వ తేదీ సాయంత్రం 5.07 గంటల వరకు ఉన్నప్పటికీ, ఆ రోజు గ్రహణ దోషం ఉండటం వల్ల ఎలాంటి రంగుల వేడుకలు జరుపుకోకూడదని పండితులు హెచ్చరిస్తున్నారు. చంద్రుడు మనకు కనిపించే ప్రత్యక్ష దైవం అని, గ్రహణ సమయంలో చంద్రుడు వేదనకు గురవుతాడు కాబట్టి, ఆ సమయాన్ని కేవలం దైవారాధనకే కేటాయించాలని ఆధ్యాత్మిక వేత్తలు సూచిస్తున్నారు. శాస్త్ర విరుద్ధంగా గ్రహణం ఉన్న రోజున రంగులు చల్లుకోవడం శుభప్రదం కాదని, అందుకే హోలీ ఉత్సవాలను 4న జరుపుకోవడమే ఉత్తమమని వారు తెలుపుతున్నారు. అయితే, ఈ పండుగ తేదీలపై క్లారిటీ వచ్చినప్పటికీ, ప్రభుత్వ సెలవుల విషయంలో మాత్రం సందిగ్ధత కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వాలు, బ్యాంకులు ఇప్పటికే మంగళవారమే సెలవని ప్రకటించాయి. ముందుగా నిర్ణయించిన సెలవు దినాల్లో మార్పు ఉండదని అధికారులు చెబుతుండటంతో, ప్రభుత్వ క్యాలెండర్ ప్రకారం కొందరు మంగళవారమే వేడుకలు చేసేందుకు సిద్ధమవుతున్నారు.




## పరీక్ష ప్యాడ్లు పంపిణీ

అక్షర దర్బార్,పరకాల: పదో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, కంపాస్ బాక్సులను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. రౌత్ మనోహర్ జ్ఞాపకార్థం గా పరకాల పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి హాజరై 40 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఫైనల్ పరీక్షలను ధైర్యంగా రాయాలని, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్ఐ దామోదర్, గర్ల్స్ హైస్కూల్ ఇంచార్జి పద్మజ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్, మండల అధ్యక్షుడు మడికొండ ప్రశాంత్, పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ, హేమంత్, సాల్మన్ రాజ్ పాల్గొన్నారు.




## నడికూడలో ఏఎల్ఎంఎస్సీ కమిటీ ఏర్పాటు

అక్షరదర్బార్, పరకాల: నడికూడ మండల కేంద్రంలోని నాలుగు అంగన్వాడి కేంద్రాల అభివృద్ధి కోసం 11 మంది సభ్యులతో నూతన ఏఎల్ఎంఎస్సీ (అంగన్వాడి లెవల్ మానిటరింగ్ అండ్ సపోర్ట్ కమిటీ) కమిటీని ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ మలహాల్ రావు అధ్యక్షతన కమిటీని నియమించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల పనితీరు మెరుగుపడి గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు మెరుగైన సేవలు అందేందుకు కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తరిగొప్పుల సంపత్, వార్డు సభ్యులు తాళ్లపల్లి స్రవంతి, తళ్ల జ్యోతి, తళ్ల మనిష, దుప్పటి ఐలయ్య, దుప్పటి సదానందం, అంగన్వాడి టీచర్ నారగాని అనిత, ఆయా దుప్పటి శాంత, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలి

- ప్రముఖ సైకాలజిస్ట్ సుధీర్ సంద్ర
- గీతాంజలి పాఠశాలలో అవగాహన సదస్సు

అక్షర దర్బార్, మహబూబాబాద్: విద్యార్థులు చదువుతో పాటు ఉత్తమ వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, సైకాలజిస్ట్ సుధీర్ సంద్ర సూచించారు. సోమవారం మహబూబాబాద్‌లోని గీతాంజలి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఒత్తిడిని అధిగమించే మార్గాలు, స్టడీ స్కిల్స్, నైతిక విలువల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం సుమారు 900 మంది తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. పిల్లలు సెల్‌ఫోన్‌లకు ఎందుకు బానిస అవుతున్నారు, వాటి వల్ల కలిగే నష్టాలు, ఇంటి వద్ద పిల్లలను సరైన మార్గంలో ఎలా గైడ్ చేయాలనే అంశాలపై అవగాహన కల్పించారు. గీతాంజలి విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ వేములపల్లి సుబ్బారావు మాట్లాడుతూ.. విద్యార్థులను అద్భుతమైన పౌరులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్లు రామకృష్ణ, కిరణ్, దేవేందర్, రాహుల్ వర్మ, ప్రిన్సిపాల్స్ ప్రవీణ్, రాజేష్, ప్రియాంక సర్కార్, మాయ, యోగాచార్యులు సదానంద బాపూజీ తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా శ్రీపాదరావు జయంతి

**- నివాళులర్పించిన ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి : ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు 89వ జయంతి వేడుకలను సోమవారం భూపాలపల్లి జిల్లా పోలీస్, కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. శ్రీపాదరావు చిత్రపటానికి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, కలెక్టర్ రాహుల్ శర్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. శ్రీపాదరావు శాసనసభ్యుడిగా, సభాపతిగా ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, అడ్మిన్ ఆర్ఐ రత్నం, వెల్ఫేర్ ఆర్ఐ పూర్ణచందర్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొని శ్రీపాదరావు సేవలకు నివాళులు అర్పించారు.





## చిన్నారులకు విద్యా సామాగ్రి పంపిణీ

అక్షర దర్బార్, మల్హర్ : ఉమ్మడి రాష్ట్ర మాజీ స్పీకర్ దివంగత దుద్దిల్ల శ్రీపాద రావు 89వ జయంతి వేడుకలను మల్హర్ రావు మండలంలోని పెద్దతూళ్లలో సోమవారం ఘనంగా నిర్వహించారు. యువజన కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ మండల రాహుల్ ఆధ్వర్యంలో గాదంపల్లి ప్రాథమిక పాఠశాల వేదికగా అడవాలపల్లి, గాదంపల్లి అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు పుస్తకాలు, విద్యా సామాగ్రి, ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి హాజరై, శ్రీపాద రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంత అభివృద్ధికి శ్రీపాద రావు చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయ సాధనలో భాగంగా యువజన కాంగ్రెస్ నాయకులు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు.



# అన్నదాతకు 'డ్రోన్' ఆసరా

- సబ్సిడీపై పంపిణీకి సర్కార్ సిద్ధం
- వ్యవసాయంలో సరికొత్త విప్లవం : మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

అక్షరదర్బార్, హైదరాబాద్ : సాంకేతికతను సామాన్య రైతుకు చేరువ చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించి, సాగు ఖర్చులను తగ్గించేందుకు 'వ్యవసాయ యాంత్రీకరణ పథకం' కింద రైతులకు సబ్సిడీతో డ్రోన్లను పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ప్రస్తుతం వ్యవసాయంలో కూలీల కొరత, పెరిగిన ఎరువులు, పురుగుమందుల ఖర్చు రైతుకు భారంగా మారుతోంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వం డ్రోన్ టెక్నాలజీని ప్రోత్సహిస్తోంది. ఈ డ్రోన్ల ద్వారా తక్కువ సమయంలో, తక్కువ మందుతో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీ చేయవచ్చని మంత్రి పేర్కొన్నారు.



**- సబ్సిడీ ఇలా..**

రైతులకు వారి సామాజిక వర్గాలను బట్టి 40 శాతం నుంచి 50 శాతం వరకు రాయితీ కల్పించనున్నారు. ముఖ్యంగా మహిళా సంఘాలు, ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రాధాన్యత ఉండనుంది. కేంద్ర పథకాలతో కలిపి మహిళా స్వయం సహాయక సంఘాలకు గరిష్టంగా 80 శాతం వరకు రాయితీ అందించేలా ప్రణాళికలు రూపొందించారు. గ్రామీణ యువతకు 'డ్రోన్ పైలట్' శిక్షణ ఇచ్చి, తద్వారా వారికి ఉపాధి కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది.

**- ఖచ్చితత్వంతో సాగు**

శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా పంటలోని ఏ ప్రాంతంలో చీడపీడలు ఉన్నాయో గుర్తించి, అక్కడ మాత్రమే మందులు చల్లే అత్యాధునిక సాంకేతికతను రైతులకు అందుబాటులోకి తెస్తామని మంత్రి వివరించారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా డ్రోన్ల పని తీరును పరిశీలించిన మంత్రి, భవిష్యత్తులో ప్రతి మండలానికి డ్రోన్ సేవలను విస్తరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ నిర్ణయం వల్ల రైతుల ఆరోగ్యం దెబ్బతినకుండా (పురుగుమందుల ప్రభావం పడకుండా) సురక్షితంగా సాగు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

## ఎమ్మెల్యేను కలిసిన 'కుడా' కాలనీవాసులు

అక్షరదర్బార్, హనుమకొండ: హనుమకొండ ఉత్సాహంతో కుడా కాలనీ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బొద్దిరెడ్డి గోపాల్ రెడ్డి, తోకల జనార్దన్ రెడ్డి తదితరులు ఉన్నారు.



# పాఠశాలల్లో ముందస్తు హోలీ సంబరాలు

అక్షర దర్బార్, నర్సంపేట : చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే హోలీ పండుగ వేడుకలు నర్సంపేట పట్టణంలోని గీతాంజలి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి ముందస్తుగా రంగుల పండుగను జరుపుకున్నారు. ఈ వేడుకల్లో విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వేములపల్లి సుబ్బారావు పాల్గొనగా, విద్యార్థులు ఉత్సాహంగా ఆయనకు రంగులు పూసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్ విద్యార్థులతో కలిసి రంగులు చల్లుకొని సందడి చేశారు.

**శ్రీ వేదలో..**

అక్షర దర్బార్, పరకాల: శాయంపేట మండలం పెద్దకోడేపాక గ్రామంలోని శ్రీ వేద పాఠశాలలో సోమవారం ముందస్తు హోలీ సంబరాలు పాఠశాల హెచ్ఎం విజయ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని కేరింతలు కొడుతూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం విజయ్ మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాలు పిల్లలకు తెలియడం వల్ల వారి జీవితం సక్రమంగా అందరితో కలిసిపోయే విధంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయునులు ప్రియాంక, కీర్తి రెడ్డి, సౌందర్య, వేద విద్యార్థులు పాల్గొన్నారు.

**విజ్ఞాన్ హై స్కూల్లో..**

అక్షర దర్బార్, ఇనుగుర్తి: మండల కేంద్రంలోని విజ్ఞాన్ హై స్కూల్ ఆవరణలో సోమవారం ముందస్తు హోలీ సంబరాలు మిన్నంటాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ గంజి అర్చన రెడ్డి మాట్లాడుతూ.. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా, ఐకమత్యాన్ని చాటిచెప్పే పండుగ హోలీ అన్నారు. వేడుకలో పాఠశాల ఉపాధ్యాయులు వెనగండ్ల చంద్రమోహన్, తోట అనిత, బోళ్ళ సుజాత, పింగిలి రమాదేవి, కారంపూరి అనూష, ఉడుత శ్వేత, కదిర రమ్య పాల్గొన్నారు.





పరకాల : శ్రీవేద పాఠశాలలో చిన్నారుల హోలీ సంబురాలు



నర్సంపేట : గీతాంజలి పాఠశాలలో హోలీ సంబురాలు



ఇనుగుర్తి: విజ్ఞాన్ హై స్కూల్లో..

# ప్రజల మధ్యకు వెళ్లండి

- పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయండి
- ప్రజలకు, పార్టీ మధ్య వారధిలా ఉండాలి
- పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలి
- ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ
- ఉభయ తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షులకు దిశానిర్దేశం
- సమావేశానికి మంత్రులకు నో ఎంట్రీ.. ఇబ్బంది పడిన పలువురు మంత్రులు
- అధిష్ఠానం, పీసీసీ నుంచి స్పష్టమైన ఆదేశాలు





అక్షరదర్బార్, వికారాబాద్ : కాంగ్రెస్ కేడర్ తో క్షేత్రస్థాయిలో మమేకమై ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని, అప్పుడే కాంగ్రెస్ పార్టీకి క్షేత్రస్థాయిలో తిరుగులేని బలం చేకూరుతుందని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఉభయ తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షులకు దిశానిర్దేశం చేశారు. సోమవారం ఉదయం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తో కలిసి ఆయన శంషాబాద్ లోని అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. వారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి నేరుగా వికారాబాద్ కు బయలుదేరిన రాహుల్ గాంధీకి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సాదరంగా ఆహ్వానం పలికారు. ముందుగా రాహుల్ పీఏసీ సమావేశం నిర్వహించారు. అనంతరం డీసీసీ అధ్యక్షులతో సమావేశమయ్యారు. అక్కడ పది రోజుల పాటు సాగిన నూతన డీసీసీ అధ్యక్షుల శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. జిల్లా స్థాయి నాయకత్వం అనేది పార్టీకి అత్యంత కీలకమైనదని, ప్రజలకు పార్టీకి మధ్య వారధిలా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, వారి ఇబ్బందులపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పోరాటాలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాల ఎన్నికలపై రాష్ట్ర నాయకత్వంతో రాహుల్ గాంధీ చర్చించినట్లు సమాచారం. ఈ నెల 16న జరగనున్న ఈ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు జరుగుతోందని, అభిషేక్ మను సింఘ్వీని మరోసారి నామినేట్ చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది. మిగిలిన ఒక స్థానం కోసం రాష్ట్రానికి చెందిన పలువురు సీనియర్ నేతలు రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. శాసనసభలో కాంగ్రెస్ కు ఉన్న బలం దృష్ట్యా రెండు రాజ్యసభ స్థానాలను సునాయాసంగా గెలుచుకుంటామనే ధీమాను రాహుల్ గాంధీ వ్యక్తం చేసినట్లు సమాచారం. అభ్యర్థుల ఎంపికపై అధికారిక ప్రకటన ఈ నెల 4వ తేదీన వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది. జిల్లా అధ్యక్షులు తమ పరిధిలోని ప్రతీ గ్రామాన్ని సందర్శించి పార్టీ కమిటీలను పటిష్ఠం చేయాలని, భవిష్యత్ ఎన్నికలే లక్ష్యంగా సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ముఖ్య నేతలతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, రెండు రాష్ట్రాల రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు, నూతనంగా ఎన్నికైన డీసీసీ అధ్యక్షులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### - మంత్రులకు అనుమతి నో

రాహుల్ గాంధీ సమావేశానికి హాజరయ్యేందుకు మంత్రులకు పీసీసీ, అధిష్ఠానం అనుమతి ఇవ్వకపోవడం చర్చనీయాంశమైంది. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు ఉద్దేశించిన డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమం కావడంతో, దీనికి మంత్రుల రాకపై పీసీసీ ఆంక్షలు విధించడం చర్చనీయాంశంగా మారింది. పీసీసీ నుంచి సూచనలు వచ్చే లోపే కొందరు మంత్రులు అనంతగిరి చేరుకుంటుండగా, సమావేశానికి రావొద్దనే ఆదేశాలు వచ్చాయని తెలిసింది. ఇదే విషయాన్ని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కూడా ఖరాఖండీగా స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో మంత్రులు చేసేదేమీ లేక తిరిగి హైదరాబాద్‌కు ప్రయాణమయ్యారు. రాహుల్ గాంధీ సమక్షంలో తమ ఉనికిని చాటుకోవాలనుకున్న మంత్రులకు, కేవలం పార్టీ కేడర్‌కే ప్రాధాన్యత ఇవ్వాలనే పీసీసీ నిర్ణయం షాక్ ఇచ్చింది.



# నాయిని మార్క్ డెవలప్మెంట్

- ఒకే రోజు రూ.9.37 కోట్లకు శంకుస్థాపన!
- దర్గా రైల్వే గేట్ నుంచి కడిపికొండ వరకు రోడ్డు మార్గం సుగమం
- దశాబ్దాల నాటి గాంధీనగర్ శ్మశానవాటిక రోడ్డు సమస్యకు పరిష్కారం

అక్షరదర్బార్, కాజీపేట: వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం నియోజకవర్గ పరిధిలోని 48, 49 డివిజన్లలో సుమారు రూ.9.37 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ కుసూర్ పాషా తదితరులు పాల్గొన్నారు. దాదాపు రూ.7.50 కోట్ల వ్యయంతో ఎన్ఐటీ నుంచి లోటస్ కాలనీ వరకు ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ రహదారిని రెండు వైపులా సెంటర్ లైటింగ్ వ్యవస్థతో అత్యంత ఆధునికంగా నిర్మించనున్నట్లు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్న ఈ రహదారి పనులు ప్రారంభం కావడంతో స్థానిక ప్రజల ఆకాంక్ష నెరవేరిందన్నారు. 48వ డివిజన్‌లో రూ. 50 లక్షలతో అంతర్గత రోడ్లు, రూ.1.37 కోట్లతో లో–లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.

### - శ్మశాన వాటిక రోడ్డుకు భూ కేటాయింపు..

కాజీపేట దర్గా ప్రాంతంలోని గాంధీనగర్ ప్రజలు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న శ్మశాన వాటిక రోడ్డు సమస్యకు ఎమ్మెల్యే పరిష్కారం చూపారు. దర్గా పీఠాధిపతి కుసూర్ పాషా గారిని ఒప్పించి, రోడ్డు ఏర్పాటు కోసం అవసరమైన స్థలాన్ని కేటాయించేలా చొరవ చూపారు. దీనితో పాటు దర్గా రైల్వే గేట్ నుంచి కడిపికొండ వరకు ఉన్న రోడ్డు నిర్మాణ ఇబ్బందులను తొలగించి, పనులను సుగమం చేసినట్లు వెల్లడించారు.

### - శంకుస్థాపనలకే పరిమితం కాదు

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. "కేవలం శంకుస్థాపనలు చేసి వదిలేయడం మా సంస్కృతి కాదు. క్షేత్రస్థాయిలో పనులు వేగంగా పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షిస్తాం. గత పాలకులు ఇన్నర్ రింగ్ రోడ్డును గాలికొదిలేస్తే, మా ప్రజా ప్రభుత్వం నిధులు సమకూర్చి పనులు మొదలుపెట్టింది" అని తెలిపారు. ఎన్నికలు లేకపోయినా ప్రజల మధ్యే ఉంటూ సమస్యలు పరిష్కరిస్తున్నామని, మాయమాటలు చెప్పే వారిని కాకుండా పనిచేసే వారిని గుర్తించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మానస రాంప్రసాద్, సత్రాజ్ బేగం, మాజీ కార్పొరేటర్ అబూబకర్, సీనియర్ నాయకులు అమర్, కట్ట రఘుపాల్ రెడ్డి, మట్టెడా కుమార్, డివిజన్ అధ్యక్షులు సింగరపు రవి ప్రసాద్, మల్లారెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ఫ్యామిలీ సర్టిఫికెట్ కు లంచం డిమాండ్

- కుత్బుల్లాపూర్ తహసీల్ లో ఏసీబీ దాడులు
- రూ.15 వేల తీసుకుంటూ పట్టుబడిన జూనియర్ అసిస్టెంట్




అక్షరదర్బార్, మేడ్చల్ : మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ఫ్యామిలీ సర్టిఫికెట్ జారీ చేసే విషయంలో జూనియర్ అసిస్టెంట్ గణేష్ బాధితుడి నుంచి రూ.30 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీనిలో భాగంగా జూనియర్ అసిస్టెంట్ మొదట రూ.15,000 తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పౌర సేవలకు సంబంధించి ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా అధికారులు సూచించారు.

# విధుల్లో చేరిన అదనపు కలెక్టర్

అక్షరదర్బార్, వరంగల్: జిల్లాలో ఇటీవల జరిగిన ఐఏఎస్ అధికారుల బదిలీల నేపథ్యంలో వైవీ గణేష్ హనుమకొండ జిల్లా నుంచి వరంగల్ జిల్లాకు అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్)గా బదిలీపై సోమవారం విధుల్లో చేరారు. అనంతరం ఆయన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. జిల్లా కలెక్టర్ ఆ మొక్కను స్వీకరించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో స్థానిక సంస్థల పనితీరును సమగ్రంగా సమీక్షిస్తూ ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.

# అంగన్వాడీ కేంద్రంలో గడువు ముగిసిన గుడ్లు పంపిణీ

అక్షర దర్బార్, శాయంపేట : మండలంలోని మాందారిపేట అంగన్వాడీ కేంద్రంలో గడువు ముగిసిన (Expired) కోడిగుడ్లను పంపిణీ చేస్తున్నారని బాధితురాలు కొమ్ముల సౌజన్య ఆరోపించారు. కేంద్రం టీచర్ స్వరూప పంపిణీ చేసిన గుడ్లపై జనవరి నెల తేదీ ఉందని, వీటిని తింటే అనారోగ్యం పాలవుతామని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనూ ఇలాంటి ఆహారం వల్లే తన చిన్నారికి జ్వరం వచ్చిందని, ప్రశ్నిస్తే టీచర్ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని మండిపడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి నాణ్యమైన పోషకాహారం అందేలా చూడాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.






# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

**డిజిటల్ విప్లవంలో భాగంకండి!**

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915